# దండుకోవడమేనా..? దండించడం రాదా?

అనుమతుల్లేకుండా ఆర్ఎంసీ నిర్వహణ
కేవలం నోటీసులతో సరిపెట్టిన
గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ అధికారులు

**చర్యలు తీసుకోవడంలో తాత్సారంపై విమర్శలు**

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం: మున్సిపల్ కమిషనర్ స్వామి**



మేడ్చల్, ఆగస్టు 26: అంగబలం, అర్ధ బలానికి, రాజకీయ ప్రాబల్యం తోడైతే అక్రమ వ్యాపారానికి అడ్డే ఉండదు. నిబంధనలను తోసిపుచ్చి, అనుమతుల అవసరం లేకుండా యథేచ్ఛగా నిర్మాణాలు చేపట్టవచ్చు. ఆపై వ్యాపారాలు చేసుకోవచ్చు. 'ఆమ్యామ్యాలు అందితే.. అది అక్రమమైనా సక్రమమే..' అన్న నానుడి గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ అక్షరాలా రుజువు చేస్తున్నది. అనుమతుల్లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా ఆర్ఎంసీని స్థాపించి, కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. పక్కనే ఉన్న జనరిక్ మందుల ఆర్ అండ్ డీ ల్యాబ్‌ల నిర్వాహకులు అక్రమమని ఎంత మొత్తుకున్నా అరణ్య రోదనే అవుతుంది.. తప్పా అధికారులు కేవలం నోటీసులకే పరిమితం అయ్యారు. బీజేపీకి చెందిన ఎంపీ కుమారుడి అండదండలు ఉండటంతోనే సదరు ఆర్ఎంసీపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### పక్కనే మందుల ఆర్ అండ్ డీ కేంద్రాలు

బాస రేగడిలో కామాక్షి ఆర్ఎంసీ ఏర్పాటు చేసిన ప్రాంతానికి కేవలం 80 నుంచి 100 మీటర్ల దూరంలో జనరిక్ మందుల పరిశోధన, అభివృద్ధి కేంద్రాలు ఉన్నాయి. రెండు కంపెనీలు నాలుగైదేళ్ల నుంచి పని చేస్తుండగా మరో రెండు కేంద్రాలు పురోగతి దశలో ఉన్నాయి. నిబంధనల ప్రకారం, ఆస్పత్రులకు 500 మీటర్ల దూరంలో ఇలాంటి కంపెనీలు ఉండాలి. మందుల పరిశోధన, అభివృద్ధి కేంద్రాలు కూడా అదే కోవకు చెందినవని కంపెనీల నిర్వాహకులు చెబుతున్నారు. ఆర్ఎంసీ నుంచి వచ్చే దుమ్ముతో ల్యాబ్‌లో పరికరాలు సరిగా పని చేయకుండా ఫలితాలను తప్పుగా చూపే అవకాశం ఉంటుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్ఎంసీని ఇక్కడి నుంచి తరలించాలని వారు అభ్యంతరం చెబుతున్నారు. హెచ్ఎండీఏ, సీఎంవో, మున్సిపాలిటీలకు ఫిర్యాదు చేశారు. హైకోర్టుకు కూడా వెళ్లారు. హైకోర్టు ఆదేశాల మేరకు హెచ్ఎండీఏ స్థానిక గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీకి చర్యలు తీసుకోవాలని సూచించింది. అయితే, మున్సిపాలిటీ నోటీసులు ఇవ్వడానికి మాత్రమే పరిమితమైందని, ఎలాంటి చర్య తీసుకోవడంలేదని ఆర్ అండ్ డీ కేంద్రాల నిర్వాహకులు ఆరోపిస్తున్నారు. గతంలో ఇచ్చిన నోటీసుపై ఆర్ఎంసీ మే 27న స్టే తెచ్చుకుంది. స్టేకు ఇచ్చిన నాలుగు వారాల సమయం పూర్తయిపోయినా చర్య తీసుకోకపోవడంతో మళ్లీ నిర్వాహకులు న్యాయస్థానానికి వెళ్లారు. ఈ సారి పలుమార్లు కోర్టులో వాదోపవాదాలు జరిగాయి. జులై 31న జరిగిన వాదనల్లో మున్సిపాలిటీ జులై 30న నోటీసులు ఇచ్చామని, చర్యలు తీసుకుంటామని వివరించింది. కానీ ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కానీ రెడీమిక్స్ కంపెనీ మాత్రం నిర్మాణం పూర్తి చేసి, కార్యకలాపాలను యథేచ్ఛగా కొనసాగిస్తుంది. కమిషనర్‌ను పలుమార్లు ఈ విషయమై కలిశామని, చర్యలు తీసుకోవడంలో తాత్సారం చేస్తున్నారని ఆర్ అండ్ డీల నిర్వాహకులు చెప్పారు. బాసరేగడిలో కామాక్షి ఆర్ఎంసీకి అనుమతులు లేవని ఫిర్యాదులు తన దృష్టికి వచ్చాయి. పరిశీలించి చర్యలు తీసుకుంటానని మున్సిపల్ కమిషనర్ స్వామి తెలిపారు.

### నిబంధనలకు తిలోదకాలు

గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ బాస రేగడిలోని సర్వే నం. 478, 480లలో భూమిని లీజుకు తీసుకొని కామాక్షి ఆర్ఎంసీని ఏర్పాటు చేశారు. ఆర్ఎంసీ ఏర్పాటుకు ఈ ఏడాది జనవరిలో పనులు ప్రారంభమయ్యాయి. ఈ కంపెనీ ఏర్పాటులో అణువుణువునా నిబంధనలకు తిలోదకాలు ఇచ్చారు. అనుమతులు తీసుకోకుండా నిర్మాణాలు చేపట్టారు. కంపెనీ ఏర్పాటుకు భూమిని కన్వర్షన్ చేసుకోవాల్సి ఉంటుంది. హెచ్ఎండీఏ నుంచి అనుమతి పొందాల్సి ఉంటుంది. అలాంటి అనుమతులేమీ తీసుకోలేదు. అంతే కాకుండా అటవీ ప్రాంతానికి ఐదు మీటర్ల దూరంలో ఉండాలనే నిబంధనను తుంగలో తొక్కారు. స్థానిక మున్సిపాలిటీ నుంచి కూడా ఎలాంటి అనుమతుల్లేవు. నిర్వాహకుల వద్ద కేవలం కాలుష్య నియంత్రణ మండలి నుంచి సీఎఫ్ఈ (కన్సర్ట్ ఫర్ ఎస్టాబ్లిష్‌మెంట్) మాత్రమే ఉంది. ఇది కంపెనీ పెట్టుకుంటామని దరఖాస్తు చేసుకుంటే టీఎస్‌పీసీబీ ఎవరికైనా ఇస్తుంది. నిబంధనలు ప్రకారం, కంపెనీని స్థాపిస్తే తుది ధ్రువీకరణగా సీఎఫ్ఓ (కన్సర్ట్ ఫర్ ఆపరేషన్) ఇస్తుంది. కాని, అది లేకుండానే కంపెనీ నిర్మాణ పనులను పూర్తి చేసి, కార్యకలాపాలను కూడా ప్రారంభించినట్టు తెలుస్తోంది.

### కంపెనీపై నోటీసులతోనే సరి.. చర్యలు శూన్యం

అనుమతుల్లేని కామాక్షి ఆర్ఎంసీ కంపెనీపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరితే పట్టించుకోవడం లేదు. కంపెనీ ఏర్పాటును ప్రారంభించిన జనవరి మొదటి వారం నుంచి పోరాటం చేస్తున్నాం. హెచ్ఎండీఏ, స్థానిక మున్సిపాలిటీకి ఫిర్యాదు చేశాం. హైకోర్టుకు వెళ్లాం..అయినా చర్యలు తీసుకోవడం లేదు. మున్సిపాలిటీ అధికారులు నోటీసుల వరకే పరిమితం అవుతున్నారు. కంపెనీ ఏర్పాటుతో వచ్చే దుమ్ముతో క్లినికల్ ట్రైల్స్‌లో తప్పుడు ఫలితాలు వచ్చే అవకాశం ఉంది. అడిషనల్ కలెక్టర్‌ను కూడా కలిసే ప్రయత్నం చేశాం. ఇంత వరకు సమయం ఇవ్వలేదు. అనుమతులు లేకుండా, నిబంధనలు పాటించకుండా ఏర్పాటు చేసిన ఈ కంపెనీని తక్షణమే తొలగించాలి.



## పుట్టిన రోజు శుభాకాంక్షలు

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ జన్మదినం సందర్భంగా సోమవారం ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు.
– ముషీరాబాద్, ఆగస్టు 26

## ఫైర్, సేఫ్టీ కోర్సుల శిక్షణకు దరఖాస్తులు

కాచిగూడ, ఆగస్టు 26: నేషనల్ సెంటర్ ఫైర్, సేఫ్టీ, ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ఫైర్, సేఫ్టీ కోర్సులకు అర్హత, ఆసక్తి గల అభ్యర్థుల నుంచి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను కోరుతున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ అడపా వెంకట్‌రెడ్డి తెలిపారు. కాచిగూడలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులు పేరొందిన ఎయిర్ పోర్ట్, అయిల్ కంపెనీలు, గ్యాస్ ఇండస్ట్రీస్, స్టార్ హోటల్స్, ఫార్మా ఇండస్ట్రీస్, రైల్వే, వివిధ కార్పొరేట్ సంస్థలలో అవకాశాలు పొందవచ్చని వెల్లడించారు. ఈ కోర్సులలో చేరేందుకు ఇంటర్, డిప్లమా, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ అభ్యర్థులను అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి గల యువకులు వచ్చే నెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు www.ncttindia.com. లేదా ఫోన్ నం. 63023 55872లో సంప్రదించాలని కోరారు.



విశ్వమాత.. మదర్ థెరీసా పుట్టిన రోజు వేడుకను సికింద్రాబాద్‌లోని సంగీత్ చౌరస్తాలో మదర్ విగ్రహం వద్ద సోమవారం ఘనంగా అభిమానులు వైభవంగా జరుపుకున్నారు. ముందుగా పూలమాలలతో అమ్మను అలంకరించి, పెద్ద ఎత్తున నివాళులర్పించారు.

## క్రిమిలేయర్ అమలుతోనే పేదలకు న్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న దళిత వికాస సమితి రాష్ట్ర అధ్యక్షులు కిన్నెర సిద్ధార్థ

ఖైరతాబాద్, ఆగస్టు 26: ఎస్సీ రిజర్వేషన్లలో క్రిమిలేయర్ విధానాన్ని అమలు చేయడం ద్వారా పేద దళితులందరికీ సమ న్యాయం జరుగుతుందని దళిత వికాస సమితి రాష్ట్ర అధ్యక్షులు కిన్నెర సిద్ధార్థ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆగస్టు 1న ఏడుగురు సభ్యులతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం ఎస్సీ, ఎస్టీలకు వర్గీకరణ జరిపే అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు ఇస్తూ ఇచ్చిన తీర్పు సమయంలో రిజర్వేషన్లలో క్రిమిలేయర్ విధానాన్ని అమలు చేయాలని సూచన చేసిందన్నారు. గడిచిన 70 ఏండ్లల్లో దళితుల్లో ఉన్న 3 శాతం మంది సంపన్న వర్గంగా అవతరించారని, ఆయా వర్గాలే నేడు క్రిమిలేయర్ వద్దంటున్నారని అన్నారు. సంపన్న ఎస్సీ, ఎస్టీలకు చెందిన వంద మంది ఎంపీలు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కలిసి క్రిమిలేయర్ విధానాన్ని అమలు చేయెవద్దని విజ్ఞాపన చేశారని, అందుకు తలొగ్గిన ప్రభుత్వం క్రిమిలేయర్ అమలు చేయమంటూ ప్రకటించడం విచారకరమన్నారు. ఈ విధానాన్ని అమలు చేయకుంటే పేద వర్గాలకు అన్యాయం చేసినట్లే అవుతుందని, వారి చర్యలను ఖండిస్తున్నామన్నారు. క్రిమిలేయర్ అడ్డుకుంటున్న ద్రోహులను ప్రశ్నిస్తూ సెప్టెంబర్ 1 నుంచి అక్టోబర్ 10 వరకు ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు 40 రోజుల పాటు దళిత సమన్యాయం పాదయాత్ర నిర్వహించనున్నామని తెలిపారు.

## బీసీలకు రిజర్వేషన్ కావాలని ఆమరణ దీక్ష

- స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్ కల్పించాలి
- మన్సూరాబాద్ డివిజన్ జడ్జెస్ కాలనీలో రెండో రోజు నిరాహార దీక్ష

మన్సూరాబాద్, ఆగస్టు 26: కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్, సమగ్ర కులగణన చేపట్టాలని చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను రెండో రోజు మన్సూరాబాద్ డివిజన్ జడ్జెస్ కాలనీలో కొనసాగించారు. మొదటి రోజు దీక్షను హైదర్‌గూడలోని బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ కార్యాలయంలో నిర్వహించారు. రెండో రోజు మన్సూరాబాద్, జడ్జెస్ కాలనీలో దీక్ష చేస్తున్న బీసీ మహాసభ అధ్యక్షుడు సిద్ధేశ్వర పటేల్, బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ అధ్యక్షుడు జక్కలి సంజీవ్ నేత, రజక రిజర్వేషన్ పోరాట సంఘం అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాడ్గేలను ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, బీసీ జన సభ అధ్యక్షుడు రాజారామ్ యాదవ్, బహుజన సేన గౌరవ అధ్యక్షుడు కదిరే కృష్ణ పరామర్శించారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్, సమగ్ర కులగణన చేపట్టాలని రెండో రోజు బీసీ నేతలు ఆమరణ దీక్షను కొనసాగిస్తున్నారని తెలుసుకున్న వనస్థలిపురం పోలీసులు సోమవారం మధ్యాహ్నం సమయంలో అక్కడికి చేరుకుని ఆమరణ దీక్ష చేస్తున్న సిద్ధేశ్వర పటేల్, జక్కలి సంజీవ నేత, చాపర్తి కుమార్ గాడ్గేను అరెస్ట్ చేసి నాగోల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ కేవీ గౌడ్, బీసీ నాయకులు కటకం నర్సింగ్ రావు, అవ్వారు వేణు కుమార్, వాసుకే యాదవ్, కోట్ల వాసు, మహేష్ గౌడ్, నరహరి పాల్గొన్నారు.

## 31 వరకు తెలుగు వర్సిటీ కోర్సుల ప్రవేశ గడువు

తెలుగు యూనివర్సిటీ, ఆగస్టు 26: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పీజీ, యూజీ, పీజీ డిప్లమా, డిప్లమా, సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ సోమవారం తెలిపారు. శిల్పం, చిత్రలేఖనం, డిజైన్, సంగీతం, రంగస్థలం, నృత్యం, జానపదం, తెలుగు, చరిత్ర, పర్యాటకం, భాషా శాస్త్రం, జర్నలిజం, జ్యోతిషం, యోగా కోర్సులలో ప్రవేశం కోసం ఈ నెల 25 వరకు దరఖాస్తులను స్వీకరించడం జరిగింది. విద్యార్థుల విజ్ఞప్తి మేరకు కోర్సులలో ప్రవేశాల గడువు ఈ నెల 31 వరకు పొడిగించినట్లు ఆయన వెల్లడించారు. వివరాలకు తెలుగు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూడవచ్చున్నారు.



## నెక్సస్ మాల్‌లో డైనోసార్ మాయా ప్రపంచం

సిటీబ్యూరో, ఆగస్ట్ 26(నమస్తే తెలంగాణ): డైనోసార్ మాయా ప్రపంచ ప్రదర్శనకు కూకట్‌పల్లిలోని నెక్సస్ మాల్ సిద్ధమైంది. అంతరించిపోయిన డైనోసార్ జంతు అస్తి పంజరాలు, కళాత్మక చిత్రాలు, భారీ బొమ్మలతో ఆకట్టుకునేలా డైనోసార్స్ ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఆగస్ట్ 17 నుంచి మొదలైన ఈ ప్రదర్శన సెప్టెంబర్ 18 వరకు కొనసాగుతుందని, ప్రవేశ రుసుముతో ప్రదర్శనను మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు వీక్షించవచ్చని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అదే విధంగా వర్క్‌షాప్‌లూ, డైనో రైడ్లు, ప్రింటింగ్ వర్క్‌షాప్‌లను కూడా నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు.

## సంఘటితమై సమస్యలు పరిష్కరించుకుందాం



టీఎస్టీవో కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన జగదీశ్వర్, ముజీబ్ హుస్సేనిని సత్కరిస్తున్న చిలకా నరసింహారెడ్డి, ముక్రమ్

ఆర్కేపురం, ఆగస్టు 26: రాష్ట్రంలో ఉన్న తొమ్మిది లక్షల ప్రభుత్వ ఉద్యోగులంతా సంఘటితమై సమస్యలను పరిష్కరించుకుందామని, పెండింగ్‌లో ఉన్న డీఏలు, ఇతర సమస్యలను వెంటనే ప్రభుత్వం తీర్చాలని టీఎస్టీవో కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్ అన్నారు. టీఎన్జీవో కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికైన మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఎస్ఎం ముజీబ్ హుస్సేనీలకు ఆత్మీయ అభినందన సభను ఆదివారం ఎన్టీఆర్‌నగర్ వ్యవసాయ మార్కెట్‌లోని టీఎన్జీవో కార్యాలయంలో నిర్వహించారు. మార్కెట్ కమిటీ ఉద్యోగుల సెంట్రల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు చిలకా నరసింహారెడ్డి, కార్యదర్శి ఎమ్డీ ఫసియోద్దిన్ ముక్రమ్ ఆధ్వర్యంలో సమావేశం కొనసాగింది. జగదీశ్వర్ మాట్లాడుతూ, పోరాడి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగుల సమస్యల గురించి మాట్లాడే నాథుడే కరువయ్యారని తెలిపారు. కొన్ని సంఘాల మాటల వల్లనే ఉద్యోగులు ప్రభుత్వానికి దూరం అవుతున్నారని, ఉద్యోగులను ఇబ్బంది పెట్టే విధంగా ప్రభుత్వం చర్యలు ఉన్నాయన్నారు. పెండింగ్ బిల్లులు, డీఏలు, పీఆర్సీ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ముజీబ్ హుస్సేన్ మాట్లాడుతూ, నాయకులు అనే వారు ఉద్యోగుల ఆలోచన మేరకు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.



బంజారాహిల్స్ హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్‌లో పచ్చదనం సంతరించుకున్న రాధాకృష్ణులు



అబిడ్స్ ఇస్కాన్ ఆలయంలో ఆకర్షణీయంగా బలరాముడు, సుభద్ర, శ్రీకృష్ణుడి అలంకరణ



బోడుప్పల్‌లోని ఓ ఆలయంలో శ్రీకృష్ణుడు

## నంద బాలం.. భజరే...

''నంద బాలం భజరే.. నంద బాలం.. బృందావన వాసుదేవ బృందలోలం'' అని శ్రీకృష్ణుని జన్మాష్టమి వేడుకలను నగరం యావత్తు సోమవారం అత్యంత ఉత్సాహంతో జరుపుకున్నారు. చిన్నా పెద్ద అంతా, ప్రధానంగా యువకులు శ్రీకృష్ణుని ఆలయాలను దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నగరం చుట్టూరా వెలసిన ఇస్కాన్ ఆలయాల్లో మాధవుడి జయంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. నగరంలో పలు యువజనులు ఉట్లు కొట్టారు. ఇంకా జారుడు స్తంభాన్ని పాకి పైనున్న బహుమతులను అందుకున్నారు. ఒక వర్గం వారే కాకుండా అన్ని సామాజిక వర్గాలు జన్మాష్టమిని ఒక ప్రధాన వేడుకగా జరుపుకున్నారు. నగరంలోని పలు వీధుల్లో ఈ ఉత్సవం అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగింది. పలువురు పడతులు కృష్ణుని పాదాలను తన ఇంటి నుంచి వస్తున్నట్టుగా ముగ్గులు వేసి ఆనందించారు.





సికింద్రాబాద్ ఇస్కాన్ టెంపుల్‌లో కృష్ణాష్టమి వేడుకలో ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు – ఉత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్న యువ భక్తులు



అత్తాపూర్‌లోని ఇస్కాన్ ఆలయంలో బ్రహ్మాండంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



నగరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో ఔత్సాహికంగా పాల్గొన్న గోపికా కృష్ణులు



రామంతాపూర్‌లో గోపికగా వర్షిత



గచ్చిబౌలిలో చిన్ని కృష్ణుడిగా ధీర విరాట్



కేపీహెచ్‌బీలో శ్రీకృష్ణగా హరిత్ బిక్షు



అబిడ్స్ ఇస్కాన్ ఆలయంలో రాధామాధవీయం



శ్రీరామ కాలనీలో గోపికగా హంసినీ సుధాత్రి